క్లుప్తంగా

28న హెల్త్ పింఛన్ లబ్ధిదారులకు వైద్య పరీక్షలు

సింగరాయకొండ: మండలంలోని హెల్త్ పెన్షన్‌దారులకు ఈనెల 28వ తేదీన ప్రత్యేక వైద్య బృందంతో వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డీ జయమణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 31 మంది ఉన్నారని, వీరందరికి ముందస్తు సమాచారం ఇచ్చామన్నారు. వైద్య బృందం వచ్చినప్పుడు ఇళ్ల వద్ద అందుబాటులో ఉండాలని, లేనివారి పెన్షన్ రద్దు చేస్తామని ఆమె హెచ్చరించారు. కలికవాయలో 2, కనుమళ్లలో 3, మూలగుంటపాడు-1లో ఒకటి, మూలగుంటపాడు-2లో 4, పాత సింగరాయకొండలో ఒకటి, శానంపూడి లో 2, పాకల-1 లో 2, పాకల-2 లో 3, సింగరాయకొండ-1 లో 3, సింగరాయకొండ-3,4ల ఒకటి చొప్పున, సోమరాజుపల్లిలో 4, ఊళ్లపాలెంలో 4 పెన్షన్ల లబ్ధిదారులను తనిఖీ చేయనున్నట్లు ఆమె వివరించారు.

రైతు సమక్షంలోనే భూ రీసర్వే



రీ సర్వే సభలో మాట్లాడుతున్న ఆర్డీవో కేశవర్ధనరెడ్డి

హనుమంతునిపాడు: ఏ రైతుకు నష్టం కాని.. ఇబ్బంది కాని జరగకుండా రైతు సమక్షంలోనే భూములను రీసర్వే చేయాలని కనిగిరి డివిజన్ ఆర్డీవో కేశవర్ధనరెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని వీరరాపురం గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వే జరిగే రోజు రైతులకు ముందుగా నోటీసుల ద్వారా తెలపాలన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం సభలు ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీ కిశోర్‌రెడ్డి సర్వేయర్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, మండల సర్వేయర్ కాకర్ల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి.. ప్రమాదం పొంచి

- ప్రమాదపుటంచున ప్రయాణాలు
- ట్రాక్టర్‌లో కిక్కిరిసి ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న కూలీలు
- వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణం
- వాహనదారులకు కరువైన రహదారి భద్రత సూచనలు

మద్దిపూడి:

రబీ సీజన్ ముగింపులో వ్యవసాయ పనులు చురుకుగా సాగుతున్నాయి. ముఖ్యంగా ఈప్రాంతంలో పొగాకు, శనగను పండిస్తారు. అయితే పంట ఉత్పత్తులను తరలించే క్రమంలో కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్లు, వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. కూలీలను పంటపొలాలకు తరలించే క్రమంలో ట్రాక్టర్, ఆటోల్లో అత్యంత ప్రమాదకరంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. మండలంలోని ఆయా గ్రామాలను కలుపుతూ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు, పాఠశాలల విద్యార్థులు సైతం ఆటోలను ఆశ్రయించి ప్రమాదకరంగా ప్రయాణాలు చేస్తున్నారు. వాహనదారులకు రహదారి భద్రతలపై సూచనలు, సలహాలు ఇవ్వకపోగా బాధ్యులపై చర్యలు తీసుకున్న దాఖలాలు సైతం కనిపించడం లేవు.

ప్రమాదకరంగా కూలీలను తరలింపు..

మండలంలో ప్రధాన వాణిజ్య పంటగా పొగాకు సాగుచేస్తారు. పొగాకు రెలపడం, వరినాట్లు, కంది, బొబ్బర్ల కోత, లేత పొగ మొక్కలు వేయడం, మిర్చిపంటల్లో కలుపుతీత తదితర వ్యవసాయ పనులు మండలంలో ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రాక్టర్, ఆటోల్లో పరిమితికి మించి కూలీలను ఎక్కిస్తున్నారు. కూలీలను ట్రాక్టర్, టాటా ఏసీ తదితర వాహనాల్లో కాళ్ల కిందకు వేలాడుతూ కూర్చోబెట్టుకుని మరీ పనులకు తీసుకెళ్తున్నారు. ఏ సమయంలోనైనా ప్రమాదం సంభవించే అవకాశాలు కనిపిస్తున్నాయి. టంగుటూరు- పొదిలి రోడ్డు అధ్వానంగా ఉంది. ఆ రహదారిలో ట్రాక్టర్లు డోర్‌లు విడిచి అత్యంత ప్రమాదకరంగా కూలీలు, ప్రయాణికులు ప్రయాణాలు చేస్తున్నారు.



ట్రాక్టర్‌లో కూలి పనులకు బయలుదేరిన కూలీలు



ఆటోల్లో ప్రమాదకంగా ప్రయాణిస్తున్న పాఠశాల విద్యార్థులు



ఆటోలల్లో కిక్కిరిసి ప్రయాణిస్తున్న ప్రయాణికులు

సమయ పాలన పాటించని ఆర్టీసీ బస్సులు..

మండలంలో ఐదు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాల, ఓ కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలలకు విద్యార్థులు వెళ్లాలంటే నానా ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు ఆటోల్లో ప్రయాణాలు ప్రమాదపుటంచున సాగిస్తున్నారు. ఆటోలకు ఇరువైపులా వేలాడుతూ గమ్యానికి చేరుకుంటున్నారు. శివరాయునిపేట వయా కెల్లంపల్లి, పన్నూరు, గుండ్లసముద్రం మీదుగా పొదిలిలోని వివిధ పాఠశాలలకు వెళ్లడానికి బస్సులు లేకపోవడంతో విద్యార్థులు ఆటోల్లో కిక్కిరిసి ప్రయాణిస్తున్నారు. కనీసం డ్రైవర్ కూర్చునేందుకు వీలులేకుండా ప్రమాదకరంగా ప్రయాణాలు సాగుతున్నాయి. చిమట, శివరాయునిపేట గ్రామాల నుంచి కాకర్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లాలంటే విద్యార్థులు ఆటోలను ఆశ్రయించక తప్పడం లేదు. అలాగే జువ్విగుంట, అయ్యవారిపాలెం, రావిళ్లవారిపాలెం నుంచి తంగెళ్ల హైస్కూల్‌కు వెళ్లాలంటే విద్యార్థులు ఆటోలు ఆశ్రయించక తప్పడంలేదు. నర్సాపురం, కొత్తూరు, వేమవరం తదితర గ్రామాల నుంచి గార్లపేట జెడ్పీ హైస్కూల్‌కు వెళ్లాలంటే ఆటోలను ఆశ్రయించాలి. అయ్యవారిపాలెం నుంచి తంగెళ్ల, కొండెపి నుంచి ధర్మవరం, మద్దిపూడి నుంచి వల్లాయపాలెం, పొదిలి నుంచి అంకేపల్లి, పొదిలి నుంచి కాకర్ల తదితర గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పశువైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

టంగుటూరు: గ్రామాల్లో పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ బేబీ రాణి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మల్లవరప్పాడు గ్రామంలో నిర్వహిస్తున్న పశుఆరోగ్య శిబిరాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య శిబిరంలో పశువులకు చూడి పరీక్షలు, దూడలకు నట్టల నివారణ మందు, తదితర పరీక్షలు చేస్తారన్నారు. పశుపోషకులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్ వెంకట్రావు, మండల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుధీర్‌బాబు, పశువ్యాధి నిర్ధారణశాల ఒంగోలు ఏడీ డాక్టర్ నాగార్జున్‌బాబు, ఎం నిడమనూరు, కొనిజేడు పశువైద్యులు ధనలక్ష్మి, సోమశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.



హనుమంతునిపాడులో మందులు పంపిణీ చేస్తున్న పశువైద్యురాలు

హనుమంతునిపాడు: గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పాడి పశువుల రైతులు సద్వినియోగం చేసుకోవాలని హనుమంతునిపాడు, వెలిగండ్ల ఏడీఏ మేకల అరుణ అన్నారు. సీతారాంపురంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది నరసింహారెడ్డి, షేక్ రసూల్, నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

రజక వృత్తిదారుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న రజక సంఘం నాయకులు

పీసీపల్లి: రజక వృత్తిదారులకు సామాజిక రక్షణ చట్టం అమలు చేయాలని కోరుతూ ఆ సంఘ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో రజక వృత్తిదారుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వపరంగా కార్పొరేషన్ ద్వారా రజకులకు సబ్సిడీ రుణాలు లబ్ధిదారులను పెంచి ఆదుకోవాలన్నారు. లాండ్రీ షాపులకు నెలకు 200 యూనిట్లు ఉచిత కరెంటు, ఇల్లు లేని వారికి ఇంటి స్థలం ఇచ్చి నిర్మాణం, తదితర డిమాండ్లు చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు టి రాము, ప్రధాన కార్యదర్శి రాయల మాలకొండయ్య, జిల్లా కమిటీ సభ్యులు బాల చెన్నయ్య, బ్రహ్మయ్య, మాజీ సర్పంచ్ కోమటిగుంట్ల వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

దొరువు ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం

కనిగిరి రూరల్: దొరువు పరిసర ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని దొరువు, శివాలయం, తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. అనంతరం చైర్మన్ గఫార్ మాట్లాడుతూ గతంలో రూ.26 లక్షలతో నిర్మించి సిమెంట్ రోడ్డుకు ఇరువైపుల ఫెన్సింగ్‌ఏర్పాటు చేసి ప్రజలకు, భక్తులకు, మహిళలకు ఇబ్బంది లేకుండా రక్షణ ఇనుప కంచెను ఏర్పాటు చేస్తామని తెలిపారు. శివాలయం రహదారిలో నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో విజయమార్తండేశ్వర దేవస్థాన చైర్మన గొంట్లా మల్లికార్జునరావు, పసుపులేటి అరుణోధర్, ఏతం కోటేశ్వరరావు, మున్సిపల్, సచివాలయ అధికారులు ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న మున్సిపల్ చైర్మన్ గఫార్

నూరుశాతం ఫలితాలపై దృష్టి సారించాలి

పామూరు: సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు మార్చిలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఫలితాల సాధనపై దృష్టిసారించాలని.. ఆదిశగా ప్రణాళికలు రూపొందించుకుని విద్యాభ్యాసం సాగించాలని ఎంపీడీఓ బొలినేని సురేష్ అన్నారు. స్థానిక ఎస్సీ బాలుర, బీసీ బాలుర వసతి గృహాలను శుక్రవారం ఎంపీడీఓ సురేష్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎంపీడీఓ హాస్టల్స్‌లో రికార్డులను, హాజరుపట్టికను పరిశీలించారు. అదేవిధంగా హాస్టల్స్‌లో వసతులను, వంటశాల, విద్యార్థులు ఉండే గదులను పరిశీలించారు. హాస్టల్‌లో సమస్యలపై విద్యార్థులతో చర్చించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. వార్డన్‌లు విద్యార్థులకు అందుబాటులో ఉండాలని సూచించారు. పరీక్షలు సమీపిస్తున్న దృష్ట్యా విద్యార్థులు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని, వార్డన్‌లుకూడా విద్యార్థుల ఆరోగ్యంపట్ల ప్రత్యేకశ్రద్ధ కనబరచాలని సూచించారు. కార్యక్రమంలో వార్డెన్ పూజల వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేష్

ఘనంగా కర్పూర ఠాగూర్ జయంతి



నివాళులర్పిస్తున్న బీసీ ఐక్యవేదిక నాయకులు

కనిగిరిరూరల్: స్వాతంత్ర్య యోధుడు, బీహార్ మాజీ ముఖ్యమంత్రి, భారతరత్న జననాయక్ కర్పూర ఠాగూర్ జయంతి వేడుకలను శుక్రవారం బీసీ ఐక్యవేదిక కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కర్పూర ఠాగూర్ అణగారిన వర్గాల కోసం అలుపెరుగని పోరాటాలు చేశారని కీర్తించారు. కార్యక్రమంలో బీసీ నాయకులు పల్లా మాలకొండ్రావు, చెరుకూరి చిన కాశయ్య, దేపూరి శివ కాశయ్య, చింతలపూడి తిరుపాలు, ఈర్ల విజయరామరాజు, బొప్పరాజు సుబ్బారావు, సీహెచ్ వెంకయ్య, చింతల పూడి వాసుదేవరావు, ఇండ్లా కోటేశ్వరరావు, పచ్చవ శేఖర్, కొండయ్య, కొబ్బరి బొండాల సుబ్బారావు, పూర్ణచంద్రారావు, గురు ప్రసాద్, చంద్ర, తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

బాలికా విద్యతోనే సమాజానికి వెలుగు

- వేడుకగా జాతీయ బాలికా దినోత్సవం
- ర్యాలీ నిర్వహించిన బాలికలు, ఉపాధ్యాయులు

పామూరు/పీసీపల్లి/సీఎస్‌పురం (పామూరు)/హనుమంతునిపాడు/కనిగిరి రూరల్: బాలికలు చదువుకుంటే సమాజం అభివృద్ధి చెందుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని కనిగిరిలో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో వేడుకగా నిర్వహించారు. స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో జరిగిన వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ బాలికలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. భ్రూణహత్యలు అరికట్టి, బాలికలను బతకనిద్దాం అని ఆయన పిలుపునిచ్చారు. డీఎల్‌డీఓ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ బాలికల సాధికారతే దేశ సాధికారత అన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సృజన మాట్లాడుతూ బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల తదితర అంశాలపై అవగాహన కల్పించారు. తొలుత 'బాలికలు బంగారం -వారి బాల్యం కాపాడటం మన బాధ్యత' అనే వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ హసీనా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ పార్వతీ, మహిళా పోలీస్ స్వప్న, వెల్ఫేర్ అసిస్టెంట్ అరుణా, వివిధ సంస్థల ప్రతినిధులు మంద్రు రమేష్, సలోమి, రాజేష్ ఖన్నా తదితరులు పాల్గొన్నారు.

☛ స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎం కలువ విజయ లక్ష్మీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు మీగడ వెంకటేశ్వరరెడ్డి మహిళలు రక్షణ చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్‌కే దిల్షాద్ బేగం, ఆదిలక్ష్మీ, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

☛ బాలిక విద్యతోనే సమాజానికి వెలుగు అని.. ఎంఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి అన్నారు. వెలిగండ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు బాలచంద్రయ్య, మాధురి, హసీనా, ఖాశిం బీ, సుజాత, వజ్ర కుమారి, తదితరులు పాల్గొన్నారు.

☛ 'ఆడపిల్లలను చదివిద్దాం, ఆడపిల్లలను రక్షిద్దాం' అనే నినాదాలతో పామూరు వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్వయంకృషి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కేజీబీవీ, మార్కొండాపురంతో పాటు పలు గ్రామాల్లో బాలికా దినోవ్సతం నిర్వహించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో కటకం సజన, యారవ శ్రీనివాసులు, పువ్వాడి వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు ఎంపీఎస్ పార్వతి, గోళ్ల పద్మజ, హెచ్‌ఎం . కే.విజయభాస్కర్‌రెడ్డి, సంస్థ అధ్యక్షుడు షేక్. నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.

☛ నూరుశాతం బాలికావిద్యతోనే మహిళాభివృద్ధి సాధ్యమని డాక్టర్ హోమద్యుతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.దేవకృపావరం అన్నారు. సీఎస్‌పురంలో జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమం శుక్రవారం స్థానిక కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో ఐసీడీఎస్, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ అవుల మురళి, ఎంఎల్‌హెచ్‌పీ శ్రీరాం లక్ష్మీకాంతమ్మ, అధ్యాపకులు షేక్ జరీనా, సిబ్బంది పాల్గొన్నారు.

☛ పీసీపల్లి కస్తూర్బా పాఠశాలలో తహసీల్దార్ ఉషా జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ మంజుల, ఎంఈఓ ఆర్ శ్రీనివాసరావు ఆరోగ్య సిబ్బంది రేణుకా దేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

☛ హనుమంతునిపాడులో కేజీబీవి బాలికల పాఠశాలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక పీహెచ్ వైద్యులు సందీప్ కుమార్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌ఓ అంజమ్మ, సీహెచ్‌ఓ కేవీ చెన్నయ్య, టీచర్లు పాల్గొన్నారు.

ఆడపిల్లల సంరక్షణకు కృషిచేయాలి..

కొండపి/పొన్నలూరు: సమాజంలోని ఆడపిల్లల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. పొన్నలూరు మండలంలోని ముప్పాళ్ల జెడ్పీ పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించి బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

☛ కొండపి మండలంలోని స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవం ప్రిన్సిపాల్ అరుణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్వైజర్ విక్టోరియా రాణి మాట్లాడుతూ బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత తీసుకోవాల్సిన పౌష్టికాహారం, సామాజిక భద్రత బాల్యవివాహాలు జరగకుండా వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఏదైనా అభద్రతకు గురైతే వెంటనే 100, 102కు కాల్ చేసి తక్షణ సహాయం పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో సురేఖ, ప్రిన్సిపాల్ అరుణ పాల్గొన్నారు. కే ఉప్పలపాడు హెచ్‌ఎం వీ సూసన్నకుమార్ ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



కనిగిరిలో వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న చైర్మన్ గఫార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ



ముప్పాళ్లలో బాలికల చట్టాలపై అవగాహన కల్పిస్తున్న రమాదేవి



సీఎస్‌పురంలో అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ హోమద్యుతి



పీసీపల్లిలో బాలికా దినోత్సవం పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు



మార్కొండాపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

సీఎస్‌పురం తహసీల్దార్‌గా వెంకటేశ్వర్లు



వెంకటేశ్వర్లు

సీఎస్‌పురం (పామూరు): సీఎస్‌పురం ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా పొన్నరుసు వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారం వేగవంతం చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తానన్నారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న డి.మంజునాథరెడ్డి సెలవుపై వెళ్లగా ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనను ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

లక్షాధికారులను చేయటమే లక్ష్యం



మాట్లాడుతున్న అధికారులు

సింగరాయకొండ: డ్వాక్రా మహిళలను లక్షాధికారులను చేయటమే ప్రభుత్వ లక్ష్యమని డీపీఎం సనిత అన్నారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం పీఎంఈజీపీ పథకంపై లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ పథకం కింద వ్యాపారం చేసేవారికి యూనిట్లు ఏర్పాటుకు రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షలు రుణంగా ఇస్తారన్నారు. ఈ రుణాన్ని వ్యాపారం ఏర్పాటు చేసుకుని నెలసరి వాయిదా పద్ధతిలో చెల్లించేలా వీఓఏలు బాధ్యత వహించాలన్నారు. ఈ సందర్భంగా 50 మందికి రుణాలు అందజేస్తున్నట్లు ఆమె వివరించారు. డీపీఎం డేవిడ్, ఏపీఎం భాగ్యలక్ష్మి, బ్యాంకు మేనేజర్ రాజీవ్, ఫీల్డ్ ఆఫీసర్ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు సోకకుండా చర్యలు

హనుమంతునిపాడు: సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటూ ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ దార్ల సందీప్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బందికి సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ పరిధిలోని హెల్త్ క్లీనిక్ పరిధిలో ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి. సీజనల్ వ్యాధులు సోకుండా ముందస్తుగా వ్యాధి నిరోధక టీకాలు చేయాలన్నారు.

నట్టల నివారణ మందు తప్పనిసరి

కందుకూరు రూరల్: గొర్రెలు, మేకలకు ఉచితంగా అందించే నట్టల నివారణ మందును తప్పనిసరిగా వేయాలని కందుకూరు పశు వైద్యశాల సహాయ సంచాలకులు జె.చంద్రమోహన్ సూచించారు. మండలంలోని కొండికందుకూరు, కొండముడుసుపాలెం గ్రామాల్లో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ పశుపోషకులకు ప్రభుత్వం నుంచి అందించే సబ్సిడీ పథకాలతో పాటు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మీ గ్రామానికి వచ్చి పశువులను వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇస్తారన్నారు. మండల పశువైద్యాధికారి ఎస్.సుధాకర్ మాట్లాడుతూ డీవార్మింగ్ మందులు ప్రతి మూడు నెలలకు ఒకసారి వాడటం వల్ల ఆరోగ్యంగా ఉండి పాల దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ఎస్‌కే.వెంకటేశ్వర్లు, జెవీఓ జి.విజయ్‌సాగర్, పశు వైద్య సహాయకులు సుహాస్, శోభన్‌బాబు, చైతన్య, లోకేష్, వేణు, షాజహాన్, కొండికందుకూరు నాయకులు రెబ్బవరపు మాల్యాద్రి, ఈదర అరుణ, బి.అనిల్, పశుపోషకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగాలను కాపాడాలి

కొండపి: ప్రభుత్వ రంగ సంస్థలని కాపాడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గంటలపల్లి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం కొండపి మండల జనరల్ బాడీ సమావేశాన్ని కే.విజయ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు ఉద్యోగలకు కార్మికులకు వ్యతిరేకమైన నిర్ణయాలుగా ఉన్నాయని అన్నారు. గతంలో వ్యవసాయ నల్ల చట్టాలు రద్దు చేయాలని పెద్ద ఎత్తున పోరాడితే చట్టాన్ని రద్దు చేస్తామని హామీ ఇవ్వడంతో పోరాటం ముగిసిందన్నారు. 26న అన్ని మండలాల్లో నిరసన చేపట్టాలని కార్మిక,కర్షక వేదిక పిలుపునిచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కాకర్ల గుంటూరు మస్తాన్ నాయకులు పాల్గొన్నారు.